ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Monday, July, 06, 2009.



# 'సహకారం'పై ఎందుకీ మమకారం?

పి. వి. సుబ్బయ్యచౌదరి

## లోతైన అధ్యయనంతో ముందుకు...



సహకార వ్యవసాయం నేడు రాష్ట్రంలో వాడి వేడి చర్చనీయాంశం. దీని మంచి చెడులపై సాగుతున్న వాదోప వాదాలు ఆద్యంతం అత్యంత ఆసక్తిదాయకం. ప్రభుత్వ, వాణిజ్య బ్యాంకుల క్రియాశీల మద్దతుతో స్వచ్ఛంద సహకార ప్రాతిపదికన ప్రతి జిల్లాలో ఒకటి లేదా రెండు గ్రామాల్లో సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదన ఉందని రాష్ట్ర గవర్నర్ జూన్ ఎనిమిదిన శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశంలో తెలిపారు. దాంతో, ఈ ప్రతిపాదనపై చర్చలు పందుకొన్నాయి. విభిన్న ఆలోచనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యవసాయ టెక్నాలజీ మిషన్ దీనిపై ముసాయిదా రూపొందించింది. ముఖ్యమంత్రి గత నెల 29న జూబ్లీహాల్‌లో సమావేశం నిర్వహించారు. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. విపక్షాలకు చెందిన వారు ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించారు. ప్రభుత్వం మాత్రం ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లో అమలు పరచి చూసే దిశలో ముందడుగు వేస్తోంది. ఈ నేపథ్యంలో సహకార వ్యవసాయం పూర్వాపరాలను విశ్లేషించవలసిన అవసరం ఉంది.

**మౌలిక అంశాలు గాలికి...**

రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన ముసాయిదాలోని అంశాలు మూడు విషయాల చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. మొదటిది వ్యవసాయ రంగం, రెండోది సహకార సంస్థల తిరోగమనం, మూడోది కంపెనీ వ్యవస్థల పనితీరు. వ్యవ

సాయరంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయం వాటా 1990లో 40శాతం కాగా, ఈ ఏడాది అది 18శాతానికి పడిపోయింది. వ్యవసాయంపై ఆధారపడినవారి సంఖ్య, సాగు విస్తీర్ణం పెరుగుతున్నప్పటికీ, జీడీపీలో వ్యవసాయం వాటా; చిన్న, సన్నకారు రైతుల ఆదాయాలు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై ప్రొఫెసర్ జయతీఘోష్, జస్టిస్ రామచెన్నారెడ్డి, ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ అనేక సిఫార్సులు చేశారు. వ్యవసాయరంగంలో పెట్టుబడులు పెరగాల్సిన ఆవశ్యకతను వారు నొక్కి చెప్పారు. రైతు అధికాదాయం పొందాలంటే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవలసి ఉంటుందో వారు సూచించారు. ప్రభుత్వం వాటిమీద దృష్టి సారించకుండా, మౌలికాంశాలపై శ్రద్ధ చూపకుండా ఆచరణయోగ్యం కాని ప్రతిపాదనలు చేయడం దురదృష్టకరమని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

రెండో అంశం- సహకార సంస్థలకు సంబంధించినది. రాష్ట్రంలో 1964 సహకార చట్టం కింద 22 జిల్లాల్లో 2451 సహకార వ్యవసాయ క్షేత్రాలు ఏర్పాటు చేశారు. 1.93 లక్షల మందిని సభ్యులుగా చేర్చుకొన్నారు. 2.72 లక్షల ఎకరాలు కేటాయించారు. దళిత, గిరిజన, వెనకబడిన వర్గాలతోపాటు ఆర్థికంగా వెనకబడినవారికీ ఈ క్షేత్రాల్లో సభ్యత్వం ఇచ్చారు. ఈ క్షేత్రాల్ని ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ సహకార ఉమ్మడి సేద్య సంఘాల సమాఖ్య 30శాతం (రుణం), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 50శాతం (సబ్సిడీ), జిల్లా దళిత, గిరిజన సంస్థలు 20శాతం (మార్జిన్ మనీ) నిధులు సమకూర్చాయి. తాలూకా సహకార శాఖాధికారికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సంఘాల పనితీరులో నిర్లక్ష్యం మేట వేసింది. నియంత్రణ వ్యవస్థ నీరుగారిపోయింది. దాంతో ఆ పథకం విఫలమైంది. జిల్లా మార్కెట్ సహకార సంస్థలు, సహకార చెరకు కర్మాగారాలు, సహకార జౌళి మిల్లులు, సహకార సూపర్‌బజార్లు, సహకార వినియోగదారుల సంఘాలు, సహకార పాల సంఘాలు విఫలం కావడం- పాఠం నేర్పే పరిణామమే. సహకార సూత్రాలకు అనుగుణంగా స్వయంప్రతిపత్తితో పనిచేసిన సహకార సంఘాలు మాత్రమే విజయం సాధించగలగడం గమనార్హం. సంఘాల పనిలో రాజకీయ పక్షాల ప్రమేయం, ప్రభుత్వ జోక్యం అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో సహకార సేద్యం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, వ్యవసాయాభివృద్ధికి, అన్నదాతలకు ఆశించిన మేర ఆదాయాలు లభించేందుకు అది ఉపకరించదని వ్యవసాయ శాస్త్రవేత్తలు, సహకార స్ఫూర్తి కలిగిన నాయకులు అభిప్రాయపడుతున్నారు. మూడో అంశం- సహకార వ్యవసాయ ముసాయిదాలో పేర్కొన్న మన రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండలాల పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకొని, కంపెనీలకు అప్పగించారు. రైతులకు సరైన నష్టపరిహారమూ చెల్లించలేదు. పైగా, ఆ మండలాల్లో ఉద్దేశించిన కార్యక్రమాలు అమలు కాలేదు. దాంతో ప్రభుత్వం తీవ్ర విమర్శల పాలైంది. ఈ విమర్శలను దారిమళ్లించేందుకే కంపెనీ వ్యవసాయం పేరుతో ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు ముందుకు తెస్తోందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కంపెనీ వ్యవసాయం ప్రతిపాదనలో పారదర్శకత లేదని, రైతుల భూములను పరోక్షంగా ఆక్రమించుకొని బడా కంపెనీలకు అప్పజెప్పడమే ప్రభుత్వ ఉద్దేశంగా కనబడుతోందని వివిధ రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. మన రాష్ట్రంలో కోటీ20లక్షల 44వేల కమతాలు ఉన్నాయి. వాటిలో అయిదెకరాలలోపు విస్తీర్ణం కలిగిన కమతాలు 83.5శాతం. వీటి కింద 70.17లక్షల హెక్టార్ల భూమి ఉంది. ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం- ఇవన్నీ చిన్న కమతాలు. అందుకే, మెరుగైన పరిజ్ఞానంతో, అధునాతన యంత్రాలతో వీటిని సాగుచేయలేకపోతున్నారు. దాంతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకే సహకార వ్యవసాయం! విదేశాల్లో చిన్న కమతాల్లో పనిచేసే యంత్రాలూ లభ్యమవుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. దేశంలో అయిదుకోట్ల టన్నుల బియ్యం, గోధుమలు, దాదాపు రెండున్నర కోట్ల టన్నుల చక్కెర నిల్వలు ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి

శరద్‌పవార్ ఈ మధ్య ప్రకటించారు. అందులో 60శాతం చిన్న కమతాల నుంచి ఉత్పత్తి అయినవేనని పాలకులు గమనించాలి. ఇక్కడ పరిగణనలోకి తీసుకోవలసిన అంశం మరొకటుంది. అదేమిటంటే- సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం నుంచి కొన్ని రాయితీలు అందుతున్నాయి. విత్తనంపై సబ్సిడీ, ఉచిత విద్యుత్తు, వ్యవసాయ ఉపకరణాలు, యంత్రాలపై రాయితీలు, వ్యవసాయ పరపతిపై వడ్డీ రాయితీలు వంటివి అందులో ఉన్నాయి. రైతుల భూముల్ని సహకార వ్యవస్థకు బదిలీ చేస్తే, ఒక్కో కమతం కొన్ని వేల ఎకరాలు దాటుతుంది. సంబంధిత వ్యవసాయ వ్యవస్థకు ఆ రాయితీలన్నీ ప్రభుత్వం కల్పిస్తుందా? అనుమానమే! వ్యవసాయంపై పెట్టుబడులు తగ్గించి, కంపెనీ పేరుతో సన్న, చిన్నకారు రైతుల నుంచి రుసుముల రూపేణా ఆదాయం పెంచుకొనేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. అలా జరగకపోతే- సంతోషమే!

'టాటా, బిర్లా, అంబానీలకు భూమి అప్పగించం. సాగులో సర్కారు జోక్యం ఉండదు. రైతులందరూ అంగీకరిస్తేనే సహకార సేద్యం అమలుచేస్తాం'- ముఖ్యమంత్రి దాదాపు ఇలాంటి హామీ ఇస్తున్నారు. కానీ, ప్రభుత్వం విడుదలచేసిన ముసాయిదాలోని 14వ పేజీలో ఉన్న ప్రతిపాదనలను పరిశీలిస్తే- పరిస్థితి భిన్నంగా ఉన్నట్లు స్పష్టమవుతుంది. సహకార వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటు, నిర్వహణను సహకార సంస్థ, కంపెనీ, లేదా సొసైటీ ద్వారా చేపట్టనున్నట్లు అందులో తెలిపారు. రైతులు భూమి హక్కులను ఆ సంస్థలకు బదిలీచేయాలని సూచించారు. బదిలీచేసిన భూమి విలువ ఆధారంగా రైతులకు వాటా పత్రాలు (షేరు సర్టిఫికెట్లు) జారీ చేస్తారు. ఆ సంస్థలో కొనసాగడం ఇష్టంలేనిపక్షంలో రైతులు బయటికి వెళ్లవచ్చు. కానీ, వారి భూమిని మాత్రం సంఘసభ్యులకు విక్రయించాలి. సంఘ సభ్యులు ముందుకు రాకపోతే, ముందుగా నిర్ణయించిన మార్కెటు ధర ప్రకారం ఆ భూమిని ప్రభుత్వం కొంటుంది. సహకార వ్యవసాయ క్షేత్రాల సాగుకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, మెరుగైన యంత్ర ఉపకరణాల ద్వారా సాగుతాయని ఆ పేజీలో తెలిపారు. ముసాయిదాలో పేర్కొన్న విధి విధానాలను ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలో వెల్లడించిన విషయాలకు పొంతన లేకపోవడం గమనార్హం. పలుపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ, సహకార వ్యవసాయం అమలు ప్రతిపాదనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేయడం దారుణం. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ అంశంపై లోతుగా అధ్యయనం జరపలేదు. క్షేత్రస్థాయిలో అభిప్రాయసేకరణ జరపలేదు. వ్యవసాయరంగ నిపుణులనుకానీ రైతు సంఘాలనుకానీ సంప్రదించలేదు. ముసాయిదాలో పేర్కొన్న విధి విధానాలలో హడావుడిగా ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టడం దురదృష్టకరం. మన రాష్ట్రంలో సహకార సంస్థల పనితీరు ఆశాజనకంగా లేదని, గతంలో చేపట్టిన సహకార వ్యవసాయ పథకాలు విఫలమయ్యాయని ముసాయిదాలో పేర్కొని, మళ్లీ అదే పద్ధతిని అమలుచేయడం వెనక మతలబు ఏమిటో పాలకులకే తెలియాలి. రష్యా, ఐరోపా, చైనాల్లో ఇలాంటి పథకాలు విఫలమయ్యాయి. దాంతో తిరిగి రైతుల యాజమాన్యంలోనే ఉమ్మడి వ్యవసాయం కొనసాగిస్తున్నారు. విఫలమైన పథకాన్ని మన ప్రభుత్వం నెత్తినెక్కించుకోవడమెందుకు? ముసాయిదా ప్రతిపాదనలపై రైతుల భయాందోళనలు తొలగించేందుకు ప్రభుత్వం పూనుకోవలసిన అవసరం ఉంది. సన్న, చిన్నకారు, కౌలు రైతుల వ్యవసాయ ఆదాయం పెంచడానికి మరింత మెరుగైన విధానాలు అనుసరించడంపై దృష్టిసారించాలి. ప్రత్యేక ఆర్థిక మండలాల కారణంగా భూములు కోల్పోయిన రైతుల దుస్థితిని దృష్టిలో ఉంచుకొని, సహకార వ్యవసాయ ప్రతిపాదనలపై లోతుగా అధ్యయనం జరిపి, వ్యవసాయాభివృద్ధికి దోహదపడే విధి విధానాలు రూపొందించాలి. ముందుగా- సహకార సంఘాల్లో రాజకీయ ప్రమేయం, ప్రభుత్వ జోక్యం ఎంతమాత్రం లేకుండా చూడాలి. సంఘాలు సహకార సూత్రాలకు లోబడి, స్వయంప్ర

తిపత్తితో పనిచేసే పరిస్థితులు కల్పించాలి. నిధుల దుర్వినియోగానికి పాల్పడే వారిపై, బాధ్యత రహితంగా వ్యవహరించే వారిపై తక్షణం కఠిన చర్యలు చేపట్టాలి.

## ఉమ్మడి వ్యవసాయం మేలు

దేశ, విదేశాల్లో మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాల పనితీరు మెరుగ్గా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రైతుల భాగస్వామ్యంతో అలాంటి సంఘాలు, బృందాలు ఏర్పరచి- ఉమ్మడి వ్యవసాయం చేపట్టాలి. వ్యవసాయ తదనుబంధ కార్యక్రమాలకు సంబంధించిన శాఖలను సమన్వయంచేసి, ఉమ్మడి వ్యవసాయంలో ఆ బృందాలకు ప్రభుత్వపరమైన సేవలన్నీ అందజేయాలి. పొలాల్లో భూసారం మెరుగుదలకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. తక్కువ వడ్డీతో వ్యవసాయ రుణాలు అందజేయాలి. అన్ని బ్యాంకులు కలిపి వ్యవసాయ రుణావసరాల్లో 30శాతమే తీరుస్తున్నాయి. మిగతా 70శాతం రుణాలకోసం రైతులు వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ దుస్థితి పోవాలి. ఉమ్మడి వ్యవసాయానికి ప్రత్యేక విస్తరణ సేవలు అందించాలి. దీనివల్ల సన్న, చిన్నకారు, కౌలు రైతుల దిగుబడులు, ఆదాయాలు పెరిగే అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వం ఈ రకమైన సహాయసహకారాలు, సేవలు అందజేస్తే భూములు రైతుల యాజమాన్యంలోనే ఉంటాయి. అదే సమయంలో ఉమ్మడి సేద్యం వ్యవసాయాభివృద్ధికి, రైతుకోసం ప్రగతికి దోహదపడుతుంది. అంతేకానీ, రైతుల అభీష్టానికి విరుద్ధంగా ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా, అది అనర్థాలకు దారితీస్తుంది. ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోకుండా పరిస్థితులపై లోతుగా అధ్యయనం చేయాలి. పరిణామాలను అంచనావేయాలి. రైతుల భూములకు భద్రత, ఆదాయానికి భరోసా కల్పిస్తూ- తగు విధివిధానాలు రూపొందించి, ఉమ్మడి వ్యవసాయం దిశలో ముందడుగు వేయాలి. అదే రైతు లోకశ్రేయోదాయకం!

(రచయిత భారత రైతు సంఘాల సమాఖ్య సలహాదారు)